నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, ఆదివారం 8 డిసెంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

6.57 గంటలకు ఖాళీ కుర్చీలతో ఆడిటోరియం ప్రాంగణం

విజయోత్సవ సభ అట్టర్ ఫ్లాప్

6.30గంటలకు జనాలు బయటికి పోకుండా గేట్‌కు తాళం వేసి ఆపుతున్న నాయకులు

- జనాలు లేక సభ వెలవెల
- వక్తలంతా మాట్లాడే వరకు ఉండని జనాలు
- ఏమీ చేయకుండానే గొప్పలు చెబుతుండడంతో వెనుదిరిగిన జనాలు

నయీంనగర్, డిసెంబర్ 7 : ప్రజాప్రభుత్వం నిర్వహించిన విజయోత్సవ సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నిర్వహించిన విజయోత్సవ సభ వెలవెలబోయింది. వక్తలు మాట్లాడక ముందే జనం ఇంటిబాట పట్టారు. శనివారం సాయంత్రం 5.22 గంటలకు ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో సభ ప్రారంభం కాగా, ఇద్దరు వక్తలు మాట్లాడే వరకే జనాలు ఉన్నారు. వారు మాట్లాడే మాటలకు విసుగుచెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఇప్పటి వరకు జనాలకు చేసిందేమీ లేదు.. కానీ, గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులేమీ చేయకుండానే ప్రచారాలు చేసుకుంటున్నారని వెనుదిరిగారు. అయితే, వచ్చిన నాయకులు మాట్లాడకముందే జనాలు పోతే పరువు పోతుందని భావించిన నిర్వాహకులు ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం రెండో గేట్‌కు తాళం వేశారు. జనాలెవరూ బయటికెళ్లకుండా ఇబ్బందులకు గురిచేశారు. ఇంట్లో పనులు ఉన్నాయి.. గేట్ తెరవండి.. అంటూ ఎంత బతిమాలాడిన వినకుండా జనాలను నిర్బంధించారు. కొందరు మొదటి గేట్ నుంచి వెళ్లే ప్రయత్నం చేసినా, అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. గేట్‌కు తాళం వేసి జనాలను ఇబ్బందిపెడుతున్న కాంగ్రెస్ నాయకులు, అక్కడికి వచ్చిన ప్రజల ఫొటోలు తీసుకున్న జర్నలిస్టులపై కొందరు కాంగ్రెస్ నాయకులు అమర్యాదగా ప్రవర్తించారు. ఫొటోలు ఎందుకు తీస్తున్నారు..అవసరమా అనడంతో అక్కడే ఉన్న జనాలు ప్రజాపాలన అంటే ఇలా ఉంటుందా.. అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

జర్నలిస్టులకు తప్పని తిప్పలు

విజయోత్సవ సభ కవరేజికి వెళ్లిన జర్నలిస్టులకూ తిప్పలు తప్పలేదు. కేవలం కాంగ్రెస్ నాయకుల వాహనాలను మాత్రమే ఆడిటోరియం గేట్ ఎదుట పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేసి,జర్నలిస్టులకు మాత్రం దూరంలో పార్కింగ్ చేసేందుకు అనుమతి ఇచ్చారు. అంతేకాకుండా అక్కడ కూర్చోడానికి కనీసం కుర్చీలు కూడా వేయకపోవడంతో నిలబడే విధులు నిర్వర్తించారు. దీంతో ఇదేం సభ అంటూ కొందరు జర్నలిస్టులు వెనుదిరిగారు.

రఘు మృతదేహంతో బల్దియా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

ఇరికించారు.. ఊపిరి తీశారు..!

- డీజిల్ స్కాంలో నిందితుడు రఘు గుండెపోటుతో మృతి
- మృతదేహంతో బల్దియా ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన
- అసలైన నిందితులను శిక్షించాలని నినాదాలు

వరంగల్, డిసెంబర్ 7 : 'అన్యాయంగా డీజిల్ స్కాంలో ఇరికించారు. మానసిక వేదనకు గురిచేశారు. చివరికి ఊపిరి తీశారు'.. అంటూ డీజిల్ స్కాంలో రెండేళ్ల క్రితం సస్పెండ్ అయిన కనకం రఘు కుటుంబ సభ్యులు ఆరోపించారు. శనివారం గుండెపోటుతో మృతి చెందిన రఘు (50) మృతదేహంతో బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రెండున్నరేళ్లు కిత్రం బల్దియాలో సుమారు రూ.40 లక్షల డీజిల్ కుంభకోణంలో డీజిల్ ఇన్‌చార్జిగా ఉన్న పీహెచ్ వర్కర్ రఘు ప్రమేయం ఉందన్న ఆరోపణలతో అధికారులు సస్పెండ్ చేశారు. తనకు ఎలాంటి సంబంధం లేదని రఘు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆదేశించినా బల్దియా అధికారులు పట్టించుకోకుండా నెల రోజుల కిత్రం క్రిమినల్ కేసు పెట్టారు. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురైన రఘు గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ కమిషనర్ రావాలి.. అసలైన దోషులను శిక్షించాలని సుమారు గంట పాటు బల్దియా ఎదుట నినాదాలు చేశారు.

కిందిస్థాయి ఉద్యోగిని బలి చేశారా?

డీజిల్ కుంభకోణంలో అసలైన దోషులను వదిలి కిందిస్థాయి ఉద్యోగిని బలి చేశారనే ఆరోణలు వెల్లువెత్తుతున్నాయి. డీజిల్ కూపన్లు ఇచ్చే కిందిస్థాయి ఉద్యోగి ఒక్కరే సుమారు రూ.40లక్షల కుంభకోణం చేయడం సాధ్యం కాదని బల్దియాలో చర్చించుకుంటున్నారు. ఒక వాహనానికి ఇచ్చే డీజిల్ కూపన్‌పై సీఎంహెచ్‌వో, శానిటరీ సూపర్‌వైజర్‌తో పాటు వాహన డ్రైవర్ సంతకాలు చేస్తారు. వాహనాలకు డీజిల్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా అప్పట్లో శానిటరీ సూపర్‌వైజర్‌కు బాధ్యతలు అప్పగించినా కుంభకోణం జరిగింది. కుంభకోణంలో సస్పెండ్ అయిన రఘుపై నెల రోజుల క్రితం మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో బల్దియా అధికారులు క్రిమినల్ కేసు పెట్టారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు రఘును కోర్టులో హాజరుపరిచి జైలుకు పంపించారు. ఇటీవల బెయిల్‌పై వచ్చిన రఘు బల్దియా కమిషనర్, సీఎంహెచ్‌వో, శానిటరీ సూపర్‌వైజర్‌పై హైకోర్టులో కేసు వేశాడు. హైకోర్టు బల్దియా కమిషనర్‌కు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

న్యాయం చేస్తాం..

రఘు శవంతో బల్దియా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులతో బల్దియా అదనపు కమిషనర్ జోనా చర్చలు జరిపారు. కుటుంబానికి న్యాయం చేస్తామని, ఒకరికి ఉద్యోగం ఇచ్చేలా కమిషనర్ దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. రఘుకు ఉద్యోగ బెనిఫిట్స్ అన్నీ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కమిషనర్ హామీతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. – జోనా, బల్దియా అదనపు కమిషనర్

రూ.5 లక్షలు ఇవ్వనందుకే హత్య

నిందితుడిని చూపిస్తున్న మట్టెవాడ ఏసీపీ నందిరాంనాయక్

- రోకలిబండతో బలంగా కొట్టడం వల్లే రాజమోహన్ మృతి
- కాల్ డేటా ఆధారంగా గుర్తింపు
- నిందితుడు ములుగు జిల్లా వాసి
- బంగారం, సెల్ ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, డిసెంబర్ 7 : పరిచయమే ప్రాణం మీదికి తెచ్చింది. రూ.ఐదు లక్షలు ఇవ్వనందుకు దారుణంగా హత్య చేసి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. ములుగు జిల్లా కోమటిపల్లి గ్రామానికి చెందిన జక్కుల శ్రీనివాసరావు గతంలో ఐదేళ్లు సర్పంచ్‌గా పనిచేశాడు. ప్రస్తుతం హనుమకొండ పట్టణంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఒంటరిగా ఉండే వ్యక్తులను టార్గెట్ చేసి, వాళ్లను మచ్చిక చేసుకొని చిన్నచిన్న నేరాలకు పాల్పడుతుండేవాడు. ఇలా రెండు నెలల క్రితం హనుమకొండ, శ్రీనగర్ కాలనీ చెందిన ఎలిగేటి రాజమోహన్ అనే రిటైర్డ్ ఉద్యోగి ఒక వ్యక్తి ద్వారా శ్రీనివాసరావుకు పరిచయమయ్యాడు. రెండు నెలలుగా ఇద్దరూ స్నేహంగా ఉంటున్నారు. రాజమోహన్‌ను మరింత దగ్గర చేసుకోవాలనే ఉద్దేశంతో శ్రీనివాసరావు అప్పుడప్పుడు మద్యం తాగించేవాడు. దీంతో వారిద్దరూ మంచి స్నేహితులయిన తర్వాత రాజమోహన్‌ను రూ.5లక్షల అప్పు కావాలని నిత్యం అడుగుతున్నా దాటేసేవాడు. దీంతో శ్రీనివాసరావు కన్ను రాజమోహన్ ధరించిన బంగారు వస్తువులపై పడింది. పక్కా ప్రణాళికతో అతడిని హత్య చేయాలనుకున్నాడు. ఈ నెల 2న రాత్రి శ్రీనివాసరావు కిరాయి ఉంటున్న పోస్టల్‌కాలనీలోని ఇంటికి వస్తే, ఇద్దరం కలిసి తాగుదామనడంతో రాజమోహన్‌ను తన కారులో శ్రీనివాస్ ఇంటి వచ్చాడు. అక్కడ ఇద్దరూ కలిసి అర్ధరాత్రి మద్యం తాగారు. పక్కా ప్రణాళిక వేసుకున్న శ్రీనివాసరావు రాజమోహన్‌కు ఎక్కువగా మద్యం తాగించి స్పృహ కోల్పోయిన తర్వాత తన ఇంట్లో ఉన్న రోకలిబండతో తలపై బలంగా కొట్టారు. దీంతో రాజమోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య జరిగిన తర్వాత తీవ్ర ఆందోళనకు గురైన శ్రీనివాసరావు అర్ధరాత్రి రాజమోహన్ మృతదేహాన్ని తీసుకొచ్చి అతడి కారులోనే వెనక సీట్లో పడేశాడు. అనంతరం ఇంట్లోని రక్తపు మరకలను తొలగిస్తుండగా, ఇంటి యజమాని రక్తపు మరకలు ఎవరివని అడుగగా, పెంపుడు కుక్కవని సమాధానం చెప్పాడు. కారులో ఉన్న రాజమోహన్ మృతదేహంతో హనుమకొండలోని కేయూ జంక్షన్, రెడ్డిపురం చెరువు, డబ్బాలఅడ్డ, వడ్డేపల్లి రోడ్డు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు తిరిగాడు. చివరకు రంగంపేట ప్రాంతంలో రాజమోహన్ మృతదేహాన్ని, కారును అక్కడ వదిలి పరారయ్యారు. రాజమోహన్ హత్య నగరంలో తీవ్ర సంచలనంగా మారడంతో మట్టెవాడ పోలీసులు సీరియస్ తీసుకొని దర్యాప్తు మొదలుపెట్టారు. సీసీ కెమెరాల ఫుటేజ్, కాల్ డేటా ఆధారంగా జక్కుల శ్రీనివాసరావు రాజమోహన్ హత్య చేసి పరారైనట్లు తమ విచారణలో తేలిందని ఏసీపీ తెలిపారు. నిందితుడి నుంచి బంగారం, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన మట్టెవాడ సీఐ గోపి, ఎస్సైలు విఠల్, నవీన్, సాంబయ్య, లచ్చయ్య, సిబ్బందిని ఏసీపీ నందిరాంనాయక్ అభినందించారు.

చపాట మిర్చికి అరుదైన ఘనత

మహబూబాబాద్, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగయ్యే చపాట మిర్చికి అరుదైన ఘనత దక్కింది. దీని జియో గుర్తింపునకు ఇండియన్ పేటెంట్ ఆఫీస్(ఐపీఓ) ఆమోదం తెలిపింది. ఈ రకం మిరపకాయలు టమాటాలా ఉంటాయి. ఇందులో కారం తక్కువ మోతాదులో ఉంటుంది. ఈ రకం మిర్చికి గతంలో లక్ష వరకు ధర పలికిన సందర్భాలున్నాయి. చపాట మిర్చికి గతంలో భౌగోళిక గుర్తింపు కోసం కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఎంతో కృషి చేసింది. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాలోని మల్యాల జీవీఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కే భాస్కర్ ఈ మిర్చికి భౌగోళిక గుర్తింపు కోసం దరఖాస్తు చేసిన విషయం తెలిసిందే. చపాట మిర్చికి ప్రత్యేక గుర్తింపు రావడంతో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధరలు లభించే అవకాశాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ములుగు జిల్లాపై ప్రకృతి పగబట్టిందా? ఎప్పుడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో వరదలు ముంచెత్తడం, ఆ తర్వాత సుడిగాలులతో తాడ్వాయి అటవీ ప్రాంతాల్లో బీభత్సం సృష్టించడం, తాజాగా మేడారం కేంద్రంగా భూకంపం సంభవించడం వంటి విపత్తులు ఎందుకు జరుగుతున్నాయి? పచ్చని అడవులు, అపురూప శిల్పసంపద నెలవైన రామప్ప ఆలయం, ఆసియా ఖండంలో ప్రఖ్యాతిగాంచిన సమ్మక్కసారలమ్మ జాతర, ప్రకృతి రమణీయ లక్నవరం సరస్సు.. ఇలా ఎన్నో అందమైన, అద్భుతమైన ప్రాంతాలున్న ములుగు జిల్లా సురక్షితమేనా? భవిష్యత్తులో మళ్లీ ఏదైనా ఉపద్రవం పొంచి ఉందా? వరుస ఘటనల ద్వారా ప్రకృతి ఇచ్చే సంకేతాలా? ఈ ప్రశ్నలన్నీ మొన్నటి భూకంపంతో జిల్లా ప్రజలను భయకంపితులను చేసింది. ప్రకృతితో చెలగాటమాడితే మూల్యం తప్పదని చెప్పకనే చెబుతోందని స్పష్టమవుతోంది. వరుస ఘటనలపై పూర్తిస్థాయి అధ్యయనం జరుగాల్సి ఉన్నప్పటికీ పర్యావరణ విధ్వంసం వల్లే విపత్తులకు కారణమని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో ప్రకృతి వనరులను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమనే విషయాన్ని అందరూ గుర్తెరగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- ములుగు, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ)

ములుగు సురక్షితమేనా?

- మేడారం అడవుల కేంద్రంగా భూకంపం
- పర్యావరణ విధ్వంసం వల్లే సంఘటనలు
- జాగ్రత్తలు తీసుకోకుంటే తప్పని ఉపద్రవం
- భవిష్యత్తుపై జిల్లా ప్రజల్లో ఆందోళన
- అన్నింటా చూపనున్న ప్రభావం

వరుస విపత్తులు దేనికి సంకేతం



సమ్మక్క గద్దె వద్ద బుధవారం భూకంపం వచ్చినప్పటి సీసీ టీవీ దృశ్యం

విపత్తులకు సంకేతాలు ఇస్తున్న మేడారం అడవులు

గత మూడు నెలలుగా ప్రకృతి వైపరీత్యాలకు కేంద్ర బిందువుగా మారుతున్న మేడారం అడవులు భవిష్యత్తులో రానున్న విపత్తులకు సంకేతాలు ఇస్తున్నట్లుగా కనపడుతుంది. బుధవారం మేడారం అటవీ ప్రాంతం కేంద్రంగా భూకంపం సంభవించినట్లు వాతావరణ శాఖ అధికారులు గుర్తించడంతో మేడారం ప్రాంతం చర్చనీయాంశంగా మారింది. మేడారం పరిసర ప్రాంతాల చుట్టూ ఏం జరుగుతుందనే సందేహాలు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. 2023 జూలై 27వ తేదిన ఎన్నడూ లేని విధంగా ములుగు ప్రాంతంలో భారీ వర్షం కురిసి జంపన్నవాగుకు వరద పోటెత్తి మేడారం ప్రాంతమంతా ఎన్నడూ లేని విధంగా జలమయమైంది. తొలి సారిగా జంపన్నవాగు నీళ్ళు తల్లుల గద్దెల వరకు చేరడంతో నాటి విపత్తును చూసిన స్థానికులు, భక్తులు భయాందోళనలు వ్యక్తం చేశారు. అదే సమయంలో మేడారంకు 10కిలో మీటర్ల దూరంలోని కొండాయి గ్రామం మొత్తం జంపన్నవాగు వరదకు కొట్టుకుపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ సంఘటనలో కొండాయి గ్రామానికి చెందిన ఎనిమిది మంది మృతి చెందారు. ఆ ఘటనలు మరువక ముందే ఈ ఏడాది సెప్టెంబర్ 1వ తేదిన తెల్లవారు జామున మేడారం అడవుల్లో వీచిన టోర్నోడో గాలులతో 500 ఎకరాల్లోని లక్షకు పైగా భారీ వృక్షాలు ఊహించని విధంగా నేలకు ఒరిగాయి. చెట్లు నేలకు ఒరిగిన ప్రాంతాన్ని శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, అటవీ శాఖ అధికారులు సందర్శించి భారీ సుడిగాలి కారణంగా చెట్లు నేల కూలినట్లు ప్రాథమికంగా నివేదిక ఇచ్చారు కాని ఆ ఘటనపై ఇప్పటికి శాస్త్రీయమైన, స్పష్టమైన నివేదికను అధికారులు కనుగొనలేకపోయారు. తాజాగా అదే ప్రాంతంలో మేడారం అడవుల కేంద్రంగా బుధవారం 5.3 తీవ్రతతో భూమి కంపించడం ములుగు ప్రాంత ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తున్నది. ఏదేమైనా ప్రభుత్వం మేడారం అడవుల కేంద్రంగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాల మిస్టరీని కనుగొనేందుకు శాస్త్రీయపరంగా అధ్యాయనం చేయించి ప్రజల్లో నెలకొన్న సందేహాలను, భయాన్ని తీర్చాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉంది.

ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరతో ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన ములుగు ప్రాంతం బుధవారం సంభవించిన భూ ప్రకంపనలతో మరోసారి కొత్త చర్చకు తెరలేపినట్లయింది. మేడారం అటవీ ప్రాంతంలో మూడు నెలలుగా సంభవిస్తున్న వరుస సంఘటనలతో జిల్లా ప్రజలు తాము నివసిస్తున్న ప్రాంతాలు సురక్షితమైనవేనా అని ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తుపై ఆందోళన చెందుతూ బాధపడుతున్నారు. సహజ సిద్ధమైన ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా వినియోగించుకోవడంతో పర్యావరణ లోపం సంభవించి ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పర్యావరణ వేత్తలు మండిపడుతున్నారు. ములుగు జిల్లాలో కాకతీయుల కాలం నాటి రామప్ప, లక్నవరం, మల్లూరు వంటి పెద్ద జలాశయాలతో పాటు 800 చెరువులు, కుంటలు నిత్యం నీటితో నిండుగా ఉంటాయి. వీటితో పాటు జిల్లాలో పెద్ద పెద్ద వాగులు, వంకలు కూడా గోదావరి నది వైపు ప్రవహిస్తూ ఉంటాయి. గోదావరి నది తీర ప్రాంతం, పక్క జిల్లాలోని సింగరేణి బొగ్గు తవ్వకాలు, ములుగు మండలంలోని మల్లంపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఎర్రమట్టి క్వారీలు, గోదావరి నదితో పాటు వాగులు, వంకలలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాల వల్లే ఇలాంటి విపత్తులు హటాత్తుగా ములుగు ప్రాంతంలో ఉత్పన్నం అవుతున్నాయి. మేడారం అడవుల్లో జరుగుతున్న ఘటనలు భవిష్యత్తులో వచ్చే విపత్తులకు సంకేతాలా అనే అనుమానాలు బలపడుతున్నాయి. 55 ఏండ్ల క్రితం ములుగు ప్రాంతంలో భూకంపం సంభవించగా బుధవారం తిరిగి అదే రీతిలో భూకంపం సంభవించడం జిల్లా యంత్రాంగంతో పాటు జిల్లా ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నది.

మానవ తప్పిదాలే విపత్తులకు కారణం

- డాక్టర్ సుతారి సతీశ్, పర్యావరణవేత్త

జరుగుతున్న విపత్తులపై మనిషి గుర్తెరుగాలి. మనం చేసే తప్పులే విపత్తులకు కారణం. పర్యావరణపరంగా ప్రకృతిని కాపాడుకుంటూ అవసరం ఉన్న మేరకే వనరులను వినియోగించుకోవాలి. ములుగు ప్రాంతంలో సింగరేణి గనుల తవ్వకం, గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుకను ఈ మధ్యకాలంలో విపరీతంగా తోడటం వల్ల భూమిలో మొత్తదనం ఏర్పడుతుంది. సింగరేణి, ఇసుక తవ్వకాలు గోదావరి పరివాహక ప్రాంతాలలోని రెండు రాష్ట్రాలలో జరుగుతున్నాయి. దీని వలన భూకంప తరంగాలు వేగంగా వ్యాపించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతుంది. భూపాలపల్లి, ములుగు అటవీ ప్రాంతంలో ఉపరితల, భూగర్భ బొగ్గు తవ్వకాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ఇప్పటికే కాకతీయ గనులు, పెద్దాపూర్ ఎక్స్‌టెన్షన్, 5వ ఇక్లైన్, 8వ ఇక్లైన్ పూర్తయ్యాయి. వీటితో పాటు త్వరలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప గుడికి అతి దగ్గరలో నాలుగున్నర కిలో మీటర్ల దూరంలో పీ.వి. నర్సింహరావు పేరుతో ఓపెన్ కాస్ట్ గనులను వెంకటాపూర్ గ్రామ శివారులో ప్రారంభం అయ్యేందుకు అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వం అనుమతులు ఇచ్చి రామప్ప శివారులో గనుల తవ్వకాలు చేపట్టినట్లయితే రాబోయే రోజుల్లో జరిగే విధ్వంసం అంతా, ఇంతా కాదు. విచ్చలవిడిగా బొగ్గు తవ్వకాలతో పాటు ములుగు మండలంలోని మల్లంపల్లి ప్రాంతంలో మైనింగ్ చేపట్టి ఖనిజ లవణాలను తవ్వడం వల్ల జరిగే ఒత్తిడి వల్ల విడుదలయ్యే శక్తి కారణంగా భూగర్భ జలాల ప్రభావ దిశ మార్చుకోవడం వలన కూడా ప్రకృతి సమతుల్యత లోపిస్తుంది. మైనింగ్ తవ్వకాలలో చాలా లోతుగా తవ్వి కావాల్సిన వాటిని తియ్యడం కోసం బ్లాస్టింగ్‌లు చేపట్టి పెద్ద పెద్ద మిషన్‌లను ఉపయోగించి తవ్వడం ద్వారా కూడా భూకంపాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆస్ట్రేలియా దేశంలో హంటర్ వాలీ ప్రాంతంలో చేసిన బొగ్గు తవ్వకాలు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బైలాడీలా ప్రాంతంలో ఐరన్ ఖనిజాల తవ్వకం, చైల్ ప్రాంతంలోని ఎస్కోన్ది డాలో కాపర్ కోసం తవ్విన మైన్‌ల వలన భూంకపాలు ఆయా ప్రాంతాల్లో వచ్చినట్లు రుజులున్నాయి. శాస్త్రజ్ఞులు కూడా ఈ విషయాలను ధృవీకరించి ఆయా ప్రాంతాలలో తవ్వకాలను చేపట్టవద్దని నివేదికలు సమర్పించారు. ప్రతీ రోజు ములుగు ప్రాంతం నుండి గోదావరి పరివాహక ప్రాంతంలో విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టి లక్షలాది మెట్రిక్ టన్నుల ఇసుకను తోడి నీటి ప్రవాహ దిశను మార్చడం, భూగర్భ జలాలను అడుగంటే విధంగా చేయడం వలన కూడా భూకంపాలు రావడానికి ఒక ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

పారా త్రోబాల్ పోటీల్లో కృష్ణవేణికి స్వర్ణం

గోల్డ్‌మెడల్ అందుకుంటున్న కృష్ణవేణి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 7 : అంతర్జాతీయ సిట్టింగ్ పారా త్రోబాల్ పోటీల్లో స్టేషన్ ఘన్ పూర్ మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన మాచర్ల కృష్ణవేణి స్వర్ణపతకంతో మెరిసింది. పుట్టుకతో దివ్యాంగురాలైన కృష్ణవేణి కృషి, పట్టుదలతో త్రోబాల్ పోటీల్లో తన ప్రతిభ చాటుతూ వచ్చింది. ఈ నెల 2 నుంచి 5 వరకు కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటి గోల్డ్‌మెడల్ కైవసం చేసుకుంది. దాతల సహకారంతో పోటీల్లో పాల్గొని విజయం సాధించి మండలానికి గుర్తింపు తీసుకొచ్చిందని క్రీడాభిమానులు అభినందించారు.

ములుగులో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

ఫ్రీ బస్సుతో ఆగమైనం..

- హామీలు అమలుచేయాల్సిందే
- ఆటోల బంద్ సందర్భంగా డ్రైవర్ల డిమాండ్

ఎన్నికల ముందు చెప్పిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని ఆటోడ్రైవర్లు డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్‌లో పలుచోట్ల శనివారం ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఆటోలు బంద్ చేపట్టి రహదారులపై ర్యాలీలు నిర్వహించి నిరసన తెలిపారు. రేవంత్ సర్కారు ఫ్రీ బస్సు తెచ్చి తమ బతుకులను ఆగం చేసిందని.. గిరాకీలు లేక కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చిట్టీలు, ఫైనాన్స్‌లు కట్టలేక 60మంది ఆత్మహత్య చేసుకున్నారని.. ఇప్పటికై నెలకు రూ.15వేలు ఇవ్వడంతో పాటు ఆటోడ్రైవర్ల కోసం రూ.1000 కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, చనిపోయిన డ్రైవర్ల కోసం వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రేపు జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు.